# దేశ టైమ్స్
DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక
VOLUME: 16 ISSUE: 133


## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారు పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

**డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,**
**మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001**
**ఫోన్: (040) 2475132,**

## ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి

చేవెళ్ల, : చేవెళ్ల బల్దియాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' వార్డు సభలు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీలోని 1, 2 వార్డు(ఉరేళ్ల)ల్లో నిర్వహించిన సభలకు స్థానిక నాయకులు, ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షాకాల సన్నద్ధత, తాగునీరు, జల - మన సంరక్షణ, మొక్కల పెంపకం - వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , వ్యవసాయం - రైతు రిజిస్ట్రీ, ఎల్ నినో ప్రభావం వంటి ఏడు అంశాలు చర్చిజరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వార్డుల వారీగా డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, సిసి రోడ్ల సమస్యలు తెలుసుకున్నారు. ఓటర్ల సౌకర్యార్థం పారదర్శకత కోసం సభ ప్రాంగణంలో పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఓల పేర్లు, ఫోన్ నెంబర్ల వివరాలతో కూడిన ఫ్లెక్సీలను అందుబాటులో ఉంచారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:133 ఎడిటర్: సయ్యద్ పాష 08-06-2026 సోమవారము పేజీలు :8 వెల:1/-




# దేశ టైమ్స్

## సంపాదకీయం

### ప్రసవం మహిళ జీవితంలో అత్యంత ప్రమాదకర దశగా భావించబడేది...

భారతదేశంలో మాతృ-శిశు ఆరోగ్య రంగం గత రెండు దశాబ్దాల్లో విశేషమైన పురోగతి సాధించింది. ఒకప్పుడు గర్భధారణ, ప్రసవం మహిళ జీవితంలో అత్యంత ప్రమాదకర దశగా భావించబడేది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదు పాయాల కొరత, శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది లేకపోవడం, అత్యవసర ప్రసూతి సేవలు అందుబాటులో ఉండకపోవడం వల్ల అనేక మంది తల్లులు, నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయేవారు. ప్రజల్లో చైతన్యం పెరిగేకొద్దీ ఆరోగ్యంపై ప్రభుత్వాల కృషి పెంచక తప్పలేదు. ఇంకా అనేక అంశాల్లో లోపాలు కొనసాగుతున్నప్పటికీ వైద్య మౌలిక వసతుల విస్తరణ, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ప్రసూతి పథకాల ద్వారా పరిస్థితి గణనీయంగా మారింది. ప్రస్తుతం దేశంలో అత్యధిక ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. మాతృ మరణాలు తగ్గాయి. శిశు మరణాల రేటు తగ్గింది. గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ గతంతో పోలిస్తే మెరుగుపడింది. ఇది ఒక గొప్ప ప్రజారోగ్య విజయగాథ. అయితే గాథ వెనుక మరో ప్రశ్న నిశ్శబ్దంగా పెరుగుతోంది. సహజ ప్రసవాలు తగ్గిపోతు న్నాయా? సిజేరియన్ శస్త్రచికిత్సలు అవసరానికి మించి పెరుగుతున్నాయా? ఈ ప్రశ్నకు కారణం తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6) గణాంకాలే.తెలంగాణలో మొత్తం ప్రసవాల్లో 62.2 శాతం సిజేరియన్ ప్రసవాలు అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రేటు 52.2 శాతం. దేశ సగటు 27.2 శాతం మాత్రమే. అంటే తెలుగు రాష్ట్రాలు జాతీయ సగటుతో పోలిస్తే దాదాపు రెండింతల స్థాయిలో ఉన్నాయి. తెలంగాణలో ప్రతి పది ప్రసవాల్లో ఆరు శస్త్రచికిత్స ద్వారానే జరుగుతున్నాయి. ఇవి సమాజంలో, ఆరోగ్య వ్యవస్థలో, వైద్య సేవల్లో, కుటుంబాల ఆలోచనల్లో వచ్చిన మార్పులకు అద్దం పడుతున్నాయి.ప్రసవాల్లో తెలంగాణ ప్రత్యేకతమన రాష్ట్రంలో 98.8 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే అవుతుండగా, దేశం లోనే అత్యధిక స్థాయిలో ఉన్న రాష్ట్రాల్లో ఇదొకటి. వాస్తవానికి ఇక్కడ ప్రసూతి సేవల విస్తరణలో దేశానికి ఆదర్శంగా నిలిచింది. గర్భిణీలకు వైద్య పరీక్షలు, టీకాలు, పోషకాహార కార్యక్రమాలు, అత్యవసర రవాణా సేవలు, ప్రసూతి ఆస్పత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆస్పత్రి ప్రసవాలు పెరగడం ఎంత మంచి విషయమో, అదే సమయంలో సిజేరియన్ ప్రసవాలు అసాధారణంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం. తెలంగాణలో ప్రయివేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో 83.9 శాతం సిజేరియన్లు. అంటే ఐదుగురిలో నలుగురికి పైగా మహిళలు శస్త్రచికిత్స ద్వారానే ప్రసవిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా 48.1 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారానే అవుతున్నాయి.సిజేరియన్ ఎందుకు అవసరం?ఈ చర్చలో ముందుగా ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. సిజేరియన్ శస్త్రచికిత్స అనేది శత్రువు కాదు. ఆధునిక వైద్యశాస్త్రం సాధించిన గొప్ప విజ యాల్లో ఇది ఒకటి. గర్భస్త శిశువుకు ఆక్సిజన్ సరఫరా తగ్గినప్పుడు, ప్రసవం ఎక్కువసేపు నిలిచిపోయి నప్పుడు, గర్భంలో బిడ్డ అడ్డంగా ఉన్నప్పుడు, మావి సమస్యలు ఉన్నప్పుడు, తీవ్రమైన రక్తపోటు వంటి పరిస్థితుల్లో సిజేరియన్ తల్లి, శిశువు ప్రాణాలను కాపాడుతుంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రాణాలు ఈ శస్త్రచికిత్స వల్ల రక్షించబడ్డాయి.కాబట్టి ప్రశ్న సిజేరియన్ మంచిదా చెడ్డదా అనేది కాదు. అవసరమైన పుడు తప్పనిసరిగా జరగాలి. కానీ అవసరం లేనప్పుడు కూడా జరుగుతోందా అనే అంశమే పరిశీలనకు అర్హం. సిజేరియన్ రేట్లు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిగా, మహిళల జీవనశైలి మారింది. గతంతో పోలిస్తే ఇప్పుడు ఆలస్య వివాహాలు ఎక్కువ. ముప్ఫయి సంవత్సరాల తర్వాత గర్భం దాల్చే మహిళల సంఖ్య పెరిగింది. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, ఊబకాయం వంటి సమస్యలు కూడా పెరిగాయి. ఇవన్నీ కొంతమేరకు సిజేరియన్ అవసరాన్ని పెంచుతాయి. రెండవది, వంధ్యత్వ చికిత్సలు. ఐవీఎఫ్ వంటి పద్ధతుల ద్వారా గర్భం దాల్చే మహిళల సంఖ్య పెరుగుతోంది. చాలామంది వైద్యులు, కుటుంబాలు ఇలాంటి గర్భధారణలను "అమూల్య గర్భాలు"గా భావించి అధిక జాగ్రత్తలు తీసుకుంటారు. మూడవది, చిన్న కుటుంబాల ధోరణి. ఒకటి లేదా రెండు పిల్లలకే పరిమితమవుతున్న కుటుంబాలు ఎటువంటి ప్రమాదం తీసుకోవడానికి ఇష్టపడడం లేదు. "ఆపరేషన్ అయితే సురక్షితం" అనే భావన బలపడుతోంది. నాలుగవది, ప్రసవ నొప్పుల పట్ల భయం. సహజ ప్రసవం గురించి సరైన అవగా హన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు, కుటుంబాలు ముందుగానే సిజేరియన్‌ను కోరుతున్నారు.వైద్యీకరణ పెరుగుతోందా?ప్రసవం సహజమైన జీవ ప్రక్రియ. కానీ క్రమంగా అది పూర్తిగా వైద్య నిర్వహణ అవసరమయ్యే ప్రక్రియగా మారుతోంది. గర్భధారణ ప్రారంభం నుంచే అనేక పరీక్షలు, స్కానింగ్‌లు, పర్య వేక్షణల మధ్య మహిళలు "రిస్క్" అనే పదాన్ని ఎక్కువగా వింటున్నారు. దాంతో సహజ ప్రసవంపై నమ్మకం తగ్గి సిజేరియన్‌పై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోందని ప్రజారోగ్య నిపుణుల మాట. కొన్ని సందర్భాల్లో ఆస్పత్రుల నిర్వహణ, సమయ ప్రణాళిక, చట్టపరమైన భయాలు కూడా వైద్య నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి గమనిస్తే తెలంగాణ 62.2 శాతం, ఆంధ్రప్రదేశ్ 52.2 శాతం రేట్లతో దేశంలో అగ్ర స్థానాల్లో ఉండగా, నాగాలాండ్‌లో కేవలం 13.2 శాతం మాత్రమే ఉంది. బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో కూడా రేట్లు చాలా తక్కువ. అయితే తక్కువ రేటు ఉన్న రాష్ట్రాలనే ఆదర్శంగా చెప్పలేం. ఎందుకంటే అక్కడ అవసరమైన సిజేరియన్లు కూడా అందుబాటులో లేకపోవచ్చు. వైద్య మౌలిక వసతులు తక్కువగా ఉండటం, నిపుణుల కొరత వంటి కారణాలు ఉండవచ్చు. అందువల్ల తక్కువ రేటు సమస్య లేదా ఎక్కువ రేటు కూడా కావచ్చు. ప్రజారోగ్య దృష్టిలో సరైన ప్రశ్న ఏమిటంటే -- అవసరమైన మహిళకు సిజేరియన్ అందుతోందా? అవసరం లేని మహిళకు సిజేరియన్ జరగడం లేదా? ఈ రకంగా పరిశీలిస్తే సిజేరియన్ కూడా ఒక పెద్ద శస్త్రచికిత్సే. ఆధునిక వైద్య సదుపాయాల వల్ల ఇది సురక్షితంగా మారినప్పటికీ కొన్ని ప్రమాదాలు లేకపోలేదు. సహజ ప్రసవంతో పోలిస్తే కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇన్ఫెక్షన్లు, రక్తస్రావం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. తరువాతి గర్భధారణల్లో కూడా కొన్ని ప్రత్యేక ప్రమాదాలు పెరుగుతాయి. ఆర్థిక భారం కూడా ఎక్కువే. ప్రయివేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ఖర్చు సహజ ప్రసవంతో పోలిస్తే అనేక రెట్లు అధికం.ఇప్పుడేం చేయాలి?ఈ సమస్యకు పరిష్కారం సిజేరియన్లను బలవంతంగా తగ్గించడం కాదు. అలాగే వాటిని యథేచ్ఛగా పెరగనివ్వడం కూడా కాదు. మొదటిగా, ప్రతి ఆస్పత్రి తన సిజేరియన్ రేటును బహిరంగంగా ప్రకటించాలి. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి. రెండవది, గర్భిణీలకు ప్రసవంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలి. సహజ ప్రసవం ఎప్పుడు సాధ్యం? సిజేరియన్ ఎప్పుడు అవసరం? అనే విషయాలు స్పష్టంగా తెలియాలి. మూడవది, ప్రసూతి సేవల్లో మిడ్‌వైఫ్‌ల పాత్రను బలోపేతం చేయాలి. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో మిడ్‌వైఫ్ ఆధారిత ప్రసూతి సేవలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. నాలుగవది, సిజేరియన్ అవసరాన్ని శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా క్రమం తప్పకుండా సమీక్షించాలి. ప్రతి సిజేరియన్ వెనుక ఒక స్పష్టమైన వైద్య కారణం ఉండాలి. ప్రతి సహజ ప్రసవానికి తగిన మద్దతు ఉండాలి. ప్రసవం ఒక వ్యాపార నిర్ణయం కాకూడదు, అది ఆరోగ్య నిర్ణయం కావాలి.ఆస్పత్రి ప్రసవాలను సాధారణం చేసిన తర్వాత, ఇప్పుడు అవసరమైన వైద్య జోక్యం, సహజ ప్రసవం మధ్య సరైన సమ తుల్యతను సాధించడం వాటి ముందున్న సవాలు. అదే తల్లి ఆరోగ్యాన్ని, శిశు ఆరోగ్యాన్ని, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని మరింత బలపరుస్తుంది.

## 'పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి'

చుంచుపల్లి, : చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్ గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించి అవసరమైన సూచనలు, సలహాలు స్వీకరించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ పారిశుధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిరా, ఉప సర్పంచ్ లక్ష్మి, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చేవెళ్ల, : చేవెళ్ల బల్దియాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' వార్డు సభలు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీలోని 1, 2 వార్డు(ఉరేళ్ల)ల్లో నిర్వహించిన సభలకు స్థానిక నాయకులు, ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షాకాల సన్నద్ధత, తాగునీరు, జల - మన సంరక్షణ, మొక్కల పెంపకం - వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , వ్యవసాయం - రైతు రిజిస్ట్రీ, ఎల్ నినో ప్రభావం వంటి ఏడు అంశాలు చర్చిజరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వార్డుల వారీగా డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, సిసి రోడ్ల సమస్యలు తెలుసుకున్నారు. ఓటర్ల సౌకర్యార్థం పారదర్శకత కోసం సభ ప్రాంగణంలో పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఓల పేర్లు, ఫోన్ నెంబర్ల వివరాలతో కూడిన ఫ్లెక్సీలను అందుబాటులో ఉంచారు.మున్సిపల్ చైర్పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్పర్సన్ కాసుల రాములు గౌడ్ మాట్లాడుతూ... వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా 'ప్రగతి ప్రణాళిక' సభలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు తమ వార్డు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.స్థానిక కౌన్సిలర్ దూత మల్లేష్ మాట్లాడుతూ... వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్ యాదగిరి వచ్చే వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సలర్ డప్పు సువర్ణ (2 వ వార్డ్ మెంబెర్),బల్దీయా అధికారులు, మెప్మా సిబ్బంది ఊూ,ాజుూ ప్రతిభ, డా. అనూష, పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

చంద్రుగొండ, : ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని భద్రాద్రి కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తిప్పనపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామసభలు ప్రజలకు, ప్రభుత్వానికి సమస్యలు తెలియజేసే వేదికలు కావాలన్నారు. రాబోయే వానకాలం సీజన్‌లో పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు శాస్త్రీయ పద్ధతిలో సాగు పనులు చేపట్టాలని సూచించారు.తడి పొడి చెత్తను గ్రామాల్లో వేర్వేరుగా సేకరించాలని, గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల సిబ్బందిని ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. కాగా, గ్రామంలోని పంట పొలాలకు వెళ్లే రహదారి ఆక్రమణకు గురైన విషయాన్ని కొందరు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, సర్పంచ్ పాల్గొన్నారు.


## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి

ప్రజా సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ సీఈఓ నాగలక్ష్మి అన్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో సర్పంచ్ గుండి బాబూరావు అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. ప్రధానంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు సంబంధించి గ్రామ సభలో పాలకవర్గం తీర్మానం చేయడంతో పాటు తడి, పొడి చెత్తలో నాలుగు రకాలు ఎలా వేరుచేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సభలో చర్చించారు.

## నిజంగా ఈ తీర్పు ఉపయోగకరమా?

న్యూఢిల్లీ:గత నెల 29న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు కేంద్ర ప్రభుత్వ, రైల్వే, ఇతర పెన్షనర్లలో చర్చనీయాంశంగా మారింది. చాలాకాలంగా పెన్షనర్ల సంఘాలు కమ్యూటెడ్ పెన్షన్ పునరుద్ధరణను పదిహేను సంవత్సరాల బదులు పన్నెండు లేదా పదమూడు సంవత్సరాలకే చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు పదిహేనేండ్ల పునరుద్ధరణ కాలాన్ని సమర్థిస్తూ ఇచ్చిన తీర్పు దెబ్బయి ఐదు లక్షల పెన్షనర్ల ఆశలపై నీళ్లు చల్లినట్టే అయింది. పెన్షన్ కమ్యూటేషన్ అంటే పెన్షనర్ తన నెలవారీ పెన్షన్‌లో కొంత భాగాన్ని వదులుకుని, దానికి బదులుగా ఒకేసారి పెద్ద మొత్తాన్ని పొందడం. పదవీ విరమణ సమయంలో ఇల్లు నిర్మించుకోవడం, అప్పులు తీర్చుకోవడం, పిల్లల విద్య లేదా వివాహ ఖర్చులు వంటి అవసరాల కోసం చా లా మంది ఈ అవకాశాన్ని వినియోగించుకుం టూ ఉంటారు. అయితే కమ్యూటేషన్ చేసిన తర్వాత ఆ భాగానికి సంబంధించిన పెన్షన్ కోత విధించబడుతుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం పదిహేను సంవత్సరాల తర్వాత మాత్రమే ఆ కోత తొలగించి పూర్తి పెన్షన్‌ను పునరుద్ధరిస్తారు. పెన్షనర్ల వాదన ఏమిటంటే, కమ్యూటేషన్ సమయంలో పొందిన మొత్తాన్ని ప్రభుత్వం నెలనెలా పెన్షన్ కోత ద్వారా సుమారు 11 నుండి 12 సంవత్సరాల లోనే తిరిగి వసూలు చేసుకుంటుంది. అలాగైతే మరో మూడు లేదా నాలుగేండ్లు కోత కొనసాగించడం అన్యాయమని వారు చెబుతున్నారు. అనేక పెన్షనర్ల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, కొంతమంది మాజీ న్యాయమూర్తులు కూడా ఈ వాదనకు మద్దతిచ్చారు.అయితే ఢిల్లీ హైకోర్టు ఈ వాదనను అంగీకరించలేదు. కమ్యూ టేషన్‌ను సాధారణ రుణం(లోన్)గా చూడకూడదని పేర్కొంది. కమ్యూటేషన్ మొత్తాన్ని నిర్ణయించేటప్పుడు వ్యక్తి జీవితకాల అంచనా, మరణాల రేటు, భవిష్యత్ వడ్డీ రేట్లు, పెన్షన్ నిధుల నిర్వహణ వంటి భవిష్యత్ ఆర్థిక భాధ్యతల అంచనా (యాక్చురియల్) సూత్రాలను ఉపయోగిస్తారని కోర్టు తెలిపింది. అందువల్ల ఒక వ్యక్తి నుండి ఎంత మొత్తం వసూలైందనే లెక్కల ఆధారంగా పునరుద్ధరణ కాలాన్ని నిర్ణయించలేమని స్పష్టం చేసింది. చట్టపరంగా చూస్తే కోర్టు తీర్పు ప్రస్తుత నిబంధనలను సమర్థించింది. రూల్10 ప్రకారం పదిహేనేండ్లు కాలవ్యవధి చెల్లుబాటు అవుతుందని ప్రకటించింది. న్యాయపరంగా ఈ తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంది. కానీ సామాజిక న్యాయం, సంక్షేమ దృష్టికోణంలో చూస్తే కొన్ని ప్రశ్నలు మిగిలే ఉన్నాయి.పెన్షనర్లకు నిజంగా ఈ తీర్పు ఉపయోగకరమా? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం చెప్పాలంటే కానే కాదు. ఈ తీర్పు వల్ల పెన్షనర్లకు ఎటువంటి అదనపు ప్రయోజనం లభించదు. వారు ఆశించినట్లుగా పునరుద్ధరణ కాలం తగ్గలేదు. పదిహేను సంవత్సరాలు పూర్తయ్యే వరకు కోత కొనసాగుతుంది. ముఖ్యంగా తక్కువ పెన్షన్ పొందుతున్నవారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పదవీ విరమణ తర్వాత వైద్య ఖర్చులు, జీవన వ్యయం, ద్రవ్యోల్బణం పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రతి రూపాయి విలువైనదే.అలాంటి సమయంలో పన్నెండు లేదా పదమూడు సంవత్సరాలకే పూర్తి పెన్షన్ వస్తే వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభించేది. కానీ ఈ తీ ర్పు ఆ అవకాశాన్ని మూసివేసింది. అయితే మరో కోణంలో చూస్తే ఈ తీర్పు ఒక స్పష్టతను ఇచ్చి ంది. చాలా సంవత్సరాలుగా, పెన్షన్ కమ్యూటీషన్ పై కొనసాగుతున్న సందిగ్ధతకు తెరపడింది. ఇకపై కోర్టు కేసుల ద్వారా 12 లేదా 13 సంవత్సరాల పునరుద్ధరణ సాధించడం కష్టమని అర్థమవుతోంది. అంటే ఈ సమస్యకు పరిష్కారం కోర్టుల్లో కాకుండా ప్రభుత్వ విధాన మార్పుల్లోనే ఉందని ఈ తీర్పు సూచిస్తోంది. ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం గుర్తుంచుకోవాలి. కోర్టు పదిహేనేండ్ల నిబంధన చట్టబద్ధమని మాత్రమే చెప్పింది. ఈ కాలాన్ని ఉత్తమమైనదని చెప్పలేదు. అలాగే భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలను సవరించకూడదని కూడా పేర్కొనలేదు. అంటే కేంద్ర ప్రభుత్వం కోరుకుంటే కమ్యూటేషన్ పట్టికలను పునఃసమీక్షించి, పునరుద్ధరణ కాలాన్ని తగ్గించే అవకాశం ఇప్పటికీ ఉంది. అందువల్ల పెన్షనర్ల ఉద్యమం ముగిసిపో యిందని భావించాల్సిన అవసరం లేదు. ఇప్పుడు పోరాటం న్యాయస్థానాల నుండి విధాన నిర్ణయాల వైపు మళ్లాలి. పెన్షనర్ల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రైల్వే పెన్షనర్ల సంస్థలు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలి. పదిహేనేండ్ల కాలవ్యవధిని పునఃసమీక్షించాలని డిమాండ్ చేయాలి.

## రానున్న రోజుల్లో టీఆర్ఎస్ ప్రభు త్వం ఏర్పడుతుంది- కవిత



హైద్రాబాద్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, రానున్న రోజుల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షురా లు కల్వకుంట్ల కవిత అన్నారు. మొయినాబాద్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి, సజ్జన్పల్లి గ్రామాలకు చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరారు.టీఆర్ఎస్ జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు బేగరి రాజు, మొయినాబాద్ మున్సిపాలిటీ ఇన్చార్జ్ ఎండీ అన్వార్ ఖాన్, మండల ఇన్చార్జ్ మేకగూడెం బిక్షపతి సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ ముందుకు సాగుతోందన్నారు.టీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి అవకాశాలు, వ్యవసాయాభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలతో కూడిన తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షేక్ మహ్మద్ నూర్ భాయ్, కావలి శ్రీను ముదిరాజ్, బొక్క సురేందర్ రెడ్డి, ఎండీ యూనిస్, బొక్క రవీందర్ రెడ్డి, గాండ్ల సంతోష్ కుమార్, సంగేరి నాగేష్, రాజీరెడ్డి, అమరేందర్ యాదవ్, గోపాల్, కత్తుల నరేందర్, పట్లోళ్ల శ్యాంరావు, వడ్డే రాజు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో బీజేపీ పాత్ర..

హైదరాబాద్, : తెలంగాణ సాధనలో బీజేపీ పాత్ర చారిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లవి సెంటిమెంట్ డ్రామాలని, తెలంగాణకు వ్యతిరేకంగా పవన్ ఎప్పుడూ మాట్లాడలేదని ఆయన చెప్పా రు. కేటీఆర్ తనతో వస్తే బీజేపీ అభివృద్ధి చేసిన రాష్ట్రాలను చూపిస్తానని రాంచందర్ రావు ప్రతిసవాల్ విసిరారు. జనసేనతో ఎన్నికల్లో పొత్తు అంశం జాతీయ నాయకత్వం నిర్ణయిస్తుందన్నారు.సీబీఐతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, పవన్ ఇంటికి మోదీ వెళ్తే వారి గుండెల్లో రైళ్లు పరు గెడుతున్నాయన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో రెండు ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. తెలంగాణ కృష్ణా జలాల వాటాను రాజకీయ ప్రయోజనాల కోసం కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు రాసిచ్చారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలోఎంఐఎం భాగస్వామ్యం లేదన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ సహా ఎవరి మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే చేసే ఆలోచన ఉందన్నారు. ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ లాంటి దుష్ప్రచారాల వెనుక అర్బన్ నక్సల్స్ శక్తులున్నాయని తెలిపారు.ఎన్నికల్లో బీజేపీ కేవలం హిందూ త్వనే అజెండాగా తీసుకోదని, అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన అజెండా అని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో తమకు మద్దతిచ్చే శక్తులను తిరస్కరించబోమన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో '12 ఏళ్ల తెలం గాణ ఆకాంక్షల సాధన-భవిష్యత్ ప్రయాణం' అనే అంశంపై నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో రాంచందర్ రావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీజేపీ పాత్రను ఎవరూ విస్మరించలేరని, అది చరిత్రలో నమోదైన సత్యమని రాం చందర్ రావు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు బీజేపీ ఎలాంటి షరతులు లేకుండా బేషరతుగా మద్దతు ఇచ్చిందని నొక్కిచెప్పారు. తెలంగాణ విషయంలో ఆంధ్ర బీజేపీ నాయకులు కూడా పార్టీ సిద్ధాం తానికి కట్టుబడి ఉన్నారన్నారు. ఇక, తెలంగాణ లో కాంగ్రెస్ నాయకులు తెలంగాణ కావాలంటే.. ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు వద్దని ఆందోళన చేశారన్నారు. బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో పెప్పర్ స్ప్రే ఘటనతో పార్లమెంట్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా, బీజేపీ తన మద్దతును వెనక్కి తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అత్యంత కీలకమైన ఆ సమయంలో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) ఎంపీలు సభలోనే లేరన్నారు. ఢిల్లీ స్థాయిలో తెలంగాణ బి ల్లు రూపకల్పన, సవరణల ప్రక్రియలో తాను ప్రత్యక్షంగా భాగస్వామి నయ్యానని రాంచంద ర్ రావు వెల్లడించారు.తాను స్వయంగా తెలంగాణ బిల్లు కాపీతో ఢిల్లీకి వెళ్లి, సీనియర్ న్యాయవాదులు ప్రకాశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డిలతో కలిసి అరుణ్ జైట్లీని, బీజేపీ జాతీయ నాయకులను కలిసి బిల్లును పూర్తిగా అధ్యయనం చేసి వివరించినట్లు పేర్కొ న్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా ఉండ టం కోసం తామంతా కలిసి రాత్రంతా కూర్చు ని చర్చిం చిన సందర్భాలు ఉన్నాయని, బిల్లు పార్లమెంట్‌కు వెళ్లే ముందు జరిగిన కీలక సంప్రదిం పుల్లోనూ, ఢిల్లీలో సమన్వయం చేయడంలో భాగస్వామ్యమయ్యారని వివరించారు.తెలంగాణ రాష్ట్రం 1,200 మందికి పైగా విద్యార్థులు, అమాయక యువకుల బలిదానాల ఫలితమని, వారి త్యాగాలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. తెలంగాణ ఉద్యమం ఏ ఒక్క పార్టీదో కాదని.. జేఏసీలు, విద్యార్థులు, న్యాయవాదులు, ఉద్యోగులు, సకల జనుల సమిష్టి పోరాటమని స్పష్టం చేశారు.ఈ ఘనతను ఏదో ఒక పార్టీకి మాత్రమే ఆపాదించాలని చూడటం చరిత్రను వక్రీకరించ డమే అవుతుందన్నారు. నాడు జేఏసీలో తామున్నా మని, కాంగ్రెస్ లేదన్నారు. రాష్ట్రం వచ్చినా ఉద్యమకారులకు నేటికీ తగిన గుర్తింపు, గౌరవం పూర్తిగా లభించకపోవడం దారుణమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల అంశాల్లో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయని మండిపడ్డారు. ముఖ్యంగా కృష్ణా జలాల వాటా విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వాలు రాజీ ధోరణి అవలంబించి, రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టాయని విమర్శించారు. గోదావరి జలాల వినియోగంలో కూడా స్పష్టమైన పాలసీ లేదని, ప్రాజెక్టుల నమూనాలు మారుస్తూ గందరగోళం సృష్టించారన్నారు.

# సమంతకు బంగారం లాంటి భర్త దొరికాడు



హీరోయిన్లు తమ కెరీర్లో ఎంత పీక్ చూసినా సరే.. ఒక దశ దాటాక డౌన్ అవ్వాల్సిందే. వాళ్లకు వయసు మీద పడి, గ్లామర్ తగ్గితే కెరీర్ ముందుకు సాగడం కష్టమవుతుంది. ఒకసారి మార్కెట్ పడిందంటే.. అవకాశాలు తగ్గి, కెరీర్లో గ్యాప్ వచ్చిందంటే మళ్లీ పుంజుకోవడం కష్టమవుతుంది. ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్లలో ఒకరిగా ఒక వెలుగు వెలిగి, తర్వాత లేడీ ఓరియెంటెడ్ సినిమాలతోనూ మెప్పించిన సమంతకు కొన్నేళ్ల నుంచి అస్సలు కలిసి రావడం లేదు. పెళ్లి విఫలమవడం, అనారోగ్య సమస్యలకు తోడు.. శాకుంతలం సినిమా డిజాస్టర్ కావడం, ఆ తర్వాత కెరీర్లో గ్యాప్ రావడంతో తన పనైపోయిందని అందరూ ఒక అభిప్రాయానికి వచ్చేశారు. 'మా ఇంటి బంగారం' అనే సినిమాను అనౌన్స్ చేసినా ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదు. చివరగా 'అన్నీ మంచి శకునములే' లాంటి డిజాస్టర్ తీసిన నందిని రెడ్డి ఈ చిత్రానికి దర్శకురాలు అని తెలియడంతో ఎగ్జైట్మెంట్ కనిపించలేదు. పైగా ఈ సినిమా రిలీజ్ బాగా ఆలస్యం కావడంతో ఆసక్తి మరింత తగ్గింది. కానీ జూన్ 19కి రిలీజ్ డేట్ ఖాయం చేసుకున్న టీం.. తాజాగా ట్రైలర్ లాంచ్ చేసింది. ఈ ప్రోమో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ట్రైలర్ రాగానే సినిమా మీద అభిప్రాయం మారిపోయింది. నిన్న తన భర్త, ఈ చిత్రానికి తెర వెనుక అన్నీ తానై వ్యవహరించిన దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో సమంత పాల్గొంది. ట్రైలర్ లాగే ఈ ఈవెంట్ కూడా సూపర్ సక్సెస్ అయింది. రాజ్‌తో సమంత కెమిస్ట్రీ, తమది తిరుపతి అని చెబుతూ అచ్చ తెలుగులో మాట్లాడ్డమే కాక, సినిమాలో సమంతతో తమ ఊరి భాషే మాట్లాడించానని రాజ్ చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. ఇక ట్రైలర్ చూస్తే.. రాజ్, డీకే దర్శకత్వంలో రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' ఛాయలు కనిపించాయి. అందులో మాదిరే ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్, యాక్షన్ మిక్స్ చేసి చాలా ఎంటర్టైనింగ్‌గా ఈ సినిమా తీసినట్లున్నారు. దీనికి దర్శకురాలు నందిని అయినా అడుగడుగునా రాజ్ ముద్ర కనిపించింది. పెళ్లి తర్వాత తన భార్య నటించిన తొలి చిత్రానికి పెట్టుబడి పెట్టడమే కాక.. క్రియేటివ్‌గా, ప్రమోషన్ల పరంగా ఎంత చేయాలో అంతా చేస్తున్నాడు రాజ్. నిజానికి రాజ్‌కు బాలీవుడ్లో ఉన్న డిమాండ్‌కు ఇలాంటి ఒక చిన్న సినిమా కోసం ఇంత చేయాల్సిన అవసరం లేదు. కానీ భార్య కోసం అతను నిలబడ్డాడు. ఒక దశలో సమంత ఎదుర్కొన్న కష్టాలు చూసి చాలా ఫీలైన తన అభిమానులు.. ఇలా తన కెరీర్‌కు పూర్తి మద్దతునిచ్చే భర్త దొరకడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. సినిమాలో సమంతకు 'బంగారం' అని టైటిల్ ఇచ్చారు కానీ.. అసలైన బంగారం రాజ్‌యే అంటూ కొనియాడుతున్నారు.

# పదేళ్ల తర్వాత మళ్లీ కార్తి...



తమ సినిమాల ప్రమోషన్ కోసం తెలుగు రాష్ట్రాలకు వచ్చినపుడు.. తెలుగులో సినిమా చేయాలనుందని, త్వరలోనే చేస్తానని తమిళ హీరోలు చెప్పడం ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతున్నదే. కానీ ఒకప్పుడు కమల్ హాసన్ తెలుగులో నిలకడగా సినిమాలు చేశాడు కానీ.. ఆయన తర్వాత కొత్త తరం హీరోలు తెలుగు వైపు చూడలేదు. కానీ చ్లలా ఏళ్ల తర్వాత ఈ ట్రెండును పున:ప్రారంభించిన ఘనత యువ కథానాయకుడు కార్తిదే. 'ఆవారా', 'నా పేరు శివ' లాంటి చిత్రాలతో తెలుగులో మంచి ఫాలోయింగ్ సంపాదించిన అతను.. తన కంటే ముందు తెలుగులో మార్కెట్ సంపాదించిన అన్న సూర్య కంటే ముందు ఇక్కడి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేశాడు. 2016లో అక్కినేని నాగార్జునతో కలిసి 'ఊపిరి' లాంటి మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసులు గెలిచాడు. ఆ చిత్రంలో కార్తి పెర్ఫామెన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఐతే ఇక్కడ మంచి ఫ్యాన్ ఫాలోయింగ్, మార్కెట్ తర్వాత మళ్లీ ఇంకో తెలుగు సినిమా చేయలేదు కార్తి. ఐతే పదేళ్ల తర్వాత ఇప్పుడు అతను తెలుగులో సినిమాను మొదలుపెట్టడం విశేషం. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించిన యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్‌తో చేతులు కలిపాడు కార్తి. వీరి కలయికలో సినిమా రాబోతున్న సంగతి ఇంతకుముందే వెల్లడైంది. ఈ చిత్రంలో కార్తి సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. ఇప్పటికే కార్తి అన్న సూర్యతో 'విశ్వనాథం అండ్ సన్స్', అంతకంటే ముందు మరో తమిళ హీరో ధనుష్‌తో 'సార్' సినిమాలను నిర్మించిన సూర్యదేవర నాగ వంశీ.. ఓ తమిళ హీరోతో ముచ్చటగా మూడో సినిమా ప్రొడ్యూస్ చేయబోతున్నాడు. నిజానికి కార్తి ఈ చిత్రం కంటే ముందు 'హిట్-4' చేస్తాడని భావించారు. నాని సినిమా 'హిట్-3'లో అతను చివర్లో క్యామియో రోల్ చేసిన సంగతి తెలిసిందే. అది 'హిట్-4'కు లీడ్ సీన్. ఐతే ఆ సినిమా సెట్స్ మీదికి వెళ్లడానికి ఇంకా సమ యం పట్టేలా ఉంది. ఈలోపే కళ్యాణ్ శంకర్, నాగవంశీ కాంబినేషన్లో సినిమాను మొద లుపెట్టాడు.

# శిథిల భవనాలను గుర్తించాలి: కమిషనర్

హైద్రాబాద్: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ సృజన పట్టణ ప్రణాళిక విభాగంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, బిల్డ్ నౌ ద్వారా అందుతున్న నిర్మాణ రంగ అనుమతులు, టీడీఆర్ దరఖాస్తులు, పెండింగ్ కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఆక్రమణల తొలగింపు, రహదారుల విస్తరణకు సంబంధించిన భూ సేకరణ అంశాల పురోగతిని సీసీపీ వెంకన్న నుంచి అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మాన్‌సూన్ సన్నద్ధతపై పై దృష్టి సారించాలని ఈ సందర్భంగా కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, సెల్లార్ తవ్వకాలు, అనధికారిక హోర్డింగ్‌లను గుర్తించి.. తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి..

సారంగాపూర్, : వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మగ్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల కోసమే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

చెన్నూర్, : ప్రజల కోసమే ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక సభలలో భాగంగా చెన్నూర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన వార్డు సభ, మండలంలోని అక్కపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బానోతు ప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామస్తులు అవగాహన కలిగి ఉండాలని, ఇంటి వద్దనే వ్యర్థాలను పొడి, తడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుగా వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన గ్రామ వాతావరణాన్ని నెలకొల్పవచ్చని వివరించారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, పునర్వినియోగం, కంపోస్టింగ్ విధానాలపై సూచనలు చేశారు. స్వచ్ఛ గ్రామ్ సురక్షిత జలవాయు కార్యక్రమం లక్ష్యాలు, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు కోసం గ్రామస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. అనంతరం చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 6, 8 వార్డుల ప్రత్యేక వార్డు సభలలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్పర్సన్ నాయకపు వినయ్, సి.ఐ., వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రగ్స్కు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు, పోలీసు శాఖ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పం చాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన ఐదుగురి అరెస్టు

నిర్మల్ : నిర్మల్ జిల్లాలో మ్యూల్ అకౌంట్స్ ద్వారా సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, చెక్ బుక్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించిన ఐదుగురిని గుర్తించామని తెలిపారు. వీరి ఖాతాల ద్వారా రూ. 8.08 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయన్నారు. లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన నిమ్మ గజేందర్, మగ్గిడి నవీన్, మగ్గిడి మహేందర్.. సోన్ మండలంలోని మాదాపూర్‌కు చెందిన మేకల నిఖిల్, షికారి, సాయి కృష్ణలు 2024 సంవత్సరం నుంచి తమ పేర్లతోపాటు వ్యాపార సంస్థల పేర్లపై వివిధ బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు ప్రారంభి వాటికి సంబంధించిన ఏటీఎం కార్డులు, ఇతర బ్యాంకు వివరాలను సైబర్ నేరగాళ్లకు అందజేశారు. అమాయకులను ఆన్‌లైన్ మోసాలకు గురి చేసి డబ్బులను ఈ ఖాతాల ద్వారా స్వీకరించారు. అనంతరం ఇతర ఖాతాలకు బదిలీ చేస్తూ నేరగాళ్లు డబ్బు జాడను దాచిపెట్టేవారు. ఇందుకు ప్రతిఫలంగా ఖాతాదారులు కమీషన్ పొందారని విచారణలో తేలిందన్నారు. లోకేశ్వరం మండలానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపర్చామన్నారు. సోన్ మండలానికి చెందిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిపై లోతుగా విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు రవీందర్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

# అడపాదడపా కాల్పులు జరపటం కూడా కాల్పుల విరమణలో భాగమే!

అమెరికా, ఏప్రిల్ ఎనిమిదవ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు మరుసటి రోజు నుంచి దాదాపు ప్రతి రోజూ అమెరికా-ఇరాన్ పరస్పరం చెబుతున్నాయి. అడపాదడపా కాల్పులు జరుగుతున్నప్పటికీ రెండు పక్షాలూ తెగేదాకా లాగటం లేదు. పరువుకోసం అమెరికా, ఇజ్రాయిల్ చూస్తుండగా బాధిత దేశంగా ఇరాన్ అనివార్య ప్రతిఘటనను కొనసాగిస్తున్నది. ఇజ్రాయిల్‌లో అక్టోబరు, అమెరికాలో నవంబరులో ఎన్నికలు జరుగుతుండటంతో ఓటర్లకు ఏం చెప్పాలో తోచక ఇరాన్‌పై ఏదో ఒకటి సాధించినట్లు ఫోజు పెట్టేందుకు ఇరుదేశాల నేతలు తంటాలు పడుతున్నారు. చివరికి పరస్పరం నిందించుకున్నట్లు నాటకం కూడా ఆడారు. ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా పట్టిన పట్టు విడవకుండా ఇరాన్ తన డిమాండ్ల గురించి గట్టిగా నిలిచింది. ఈ పూర్వరంగంలో బుధవారం నాడు ఇరాన్‌పై దాడులను ముగించేందుకు అమెరికా పార్లమెంటు ప్రజా ప్రతినిధుల సభ ఒక తీర్మానాన్ని ఆమోదించటంతో వ్యూహాత్మకంగా వెనక్కు తగ్గేందుకు డోనాల్డ్ ట్రంప్ పావులు కదుపు తున్నట్లు కనిపిస్తోంది. ఈ తీర్మానానికి నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతు తెలిపారు. పార్లమెంటు ఆమోదం లేకుండా దాడులు సాగించే అధ్యక్షుడి అధికా రాలకు ఇది కత్తెర వేసింది. అయితే 'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా' అన్నట్లు అమెరికా పాలకవర్గం తలచుకోవాలేగానీ ఇలాంటి తీర్మానాలను ఉల్లంఘించటం ఒక లెక్కలోనిది కాదు. ఇరాన్‌తో పోరు ముగిసినట్లే అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెప్పాడు. లెబనాన్ రాజధాని బీరుట్ నగరంతో సహా అనేక ప్రాంతాలపై ఆధిపత్యం కలిగి ఉన్న హిజబుల్లా సాయుధశక్తితో తొలిసారి చర్చలు జరిపినట్లు కూడా చెప్పటం, ఇజ్రాయిల్‌తో వాషింగ్టన్‌లో ఒప్పందం కుదిరినట్లు అమెరికా ప్రకటిం చటంతో ముడిచమురు ధర స్వల్పంగా తగ్గింది. ఒక వైపు హిజబుల్లాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ లెబనాన్‌లో తమ కార్యకలాపాలు కొనసాగు తాయని ఇజ్రాయిల్ ప్రకటించటంతో సమస్య తిరిగి మొదటికే వచ్చినట్లు చెప్పవచ్చు లేదా ఇరాన్‌పై వత్తిడి వ్యూహం కూడా కావచ్చు. అయితే ఇప్పుడున్న కాల్పుల విరమణ ఒప్పందం పొడగింపు లేదా శాశ్వత ఒప్పందం గురించి ఇరాన్ వైపు నుంచి ఎలాంటి ప్రకటన లేనప్పటికీ సంప్రదిం పులు కొనసాగుతున్నట్లు ప్రకటించటం ఊరట కలిగించే అంశమే. ఆత్మరక్షణ కోసం తాము ఇరాన్‌లోని కొన్ని ప్రాంతాల మీద దాడులు జరిపినట్లు కొద్ది రోజుల క్రితం అమెరికా ప్రకటించగా తాము కూడా అందుకోసమే కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాల మీద క్షిపణుల వర్షం కురిపించినట్లు ఇరాన్ జవాబిచ్చింది. ట్రంప్ మీద నెతన్యాహు కేకలు వేసినట్లు కొద్ది రోజుల క్రితం మీడియాలో వార్తలు రాగా తాజాగా నెతన్యాహు పిచ్చివాడని ట్రంప్ రంకెలు వేసినట్లు రాసిన సంగతి తెలిసిందే. అయితే ఇదంతా ఉత్తుత్తి వ్యవహారం తప్ప మరొకటి కాదు, ఉదయం పూట తాము గట్టిగా మాట్లాడుకున్నప్పటికీ మధ్యాహ్ననికి మామూలుగా ఇద్దరం కలిసి చేయాల్సినదాని గురించి నిర్ణయించుక్నంటామని ట్రంప్-నెతన్యాహు చెప్పటాన్ని గమనించాలి. తమ మధ్య వ్యూహాత్మక అంశాలపై తేడాలు తప్ప ఏది చేసినా కలిసే చేస్తామని కూడా వారు స్పష్టం చేశారు. ఇరాన్‌పై వత్తిడి తెచ్చే ఎత్తుగడలో భాగంగానే లెబనాన్‌పై యూదు దురహంకారుల దాడులని వేరే చెప్పనవసరం లేదు. ఆ దాడులు ఆగకుండా వాషింగ్టన్‌తో రాజీ లేదని టెహరాన్ పదే పదే చెబుతున్నది. అడపాతడపా కొన్ని దాడులు చేస్తున్నప్పటికీ మరోసారి భారీ దాడులు, భూతల పోరుకు వెళ్లటం లేదని తన సన్నిహితులతో ట్రంప్ చెప్పినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక రాసింది. ఈ వార్తలు అమెరికా దిక్కుతోచని స్థితిని వెల్లడిస్తున్నాయి. దానికి నిదర్శనంగా కాల్పుల విరమణకు సరికొత్త భాష్యం చెప్పాడు. అడపాదడపా కాల్పులు జరపటం కూడా కాల్పుల విరమణలో భాగమే అన్నాడు. దీన్ని బట్టి హోర్ముజ్ జలసంధిలో ఇప్పుడున్న తన బలగాలను వెనక్కు తీసుకోవటం జరగదని ముందే చెప్పుకున్నట్లు ఆత్మరక్షణ పేరుతో అప్పుడప్పుడూ దాడులకు తెగబడుతుం టామని చెప్పినట్లే. అయితే ఇలాంటి వైఖరి ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారుతుందని వేరే చెప్పనవసరం లేదు. అమెరికా మరొక దేశం నుంచి ఇంధనాన్ని దిగుమతులు చేసుకోవాల్సిన అవసరం లేకున్నా అక్కడి కంపెనీలు జనాన్ని బాదుతున్నాయి. పశ్చిమాసియా పోరు ముగిసిన తరువాతే ధరలు తగ్గుతాయని, అయినా పెద్దగా పెరుగుదల లేదని ట్రంప్ సమర్థించుకుంటున్నాడు. గృహస్తుల ఇంధన భారం పెరుగుదల నుంచి ఉపశమనం కలిగించేందుకు జపాన్ 19 బిలియన్ డాలర్ల పాకేజ్‌ను ప్రకటించింది. మరోవైపు జీడీపీలో జపాన్‌ను వెనక్కు కొట్టామని గొప్పలు చెప్పుకున్న నరేంద్రమోడీ సర్కార్ మాత్రం ఉపశమనం కల్పించకపోగా ముడి చమురు ధరలు పెరిగినందున వినియోదారులే వాటిని భరించాలంటూ ఇంధన ధరలను పెంచుతున్న సంగతి తెలిసిందే. సామాన్యులకు వట్టిస్తరి మంచినీళ్ల కబుర్లు చెబుతూ విమానాల్లో తిరిగే బడాబాబులు, విదేశాలకు ఎగుమతి చేసే చమురు ఉత్పత్తుల మీద మాత్రం పన్నులు తగ్గిస్తూ సంపన్నులు, విదేశీ భక్తిని చాటుకుంటున్నారు. అందుకే ఏ పదజాలం మాటున ఏ ప్రయోజనం దాగుందో తెలుసుకోలేనంత కాలం జనాలు మోసపోతూనే ఉంటారు!

# అన్యాయాలపై కార్మికుల పక్షాన నిలదీస్తూనే ఉంటాం - కేటీఆర్



హైద్రాబాద్: సిద్దిపేటలో హరీష్ రావు క్యాంప్ ఆఫీస్ మీద దాడి చేసి, 'పెట్రోల్ పోసి తగలబెడ తా' అన్న కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావుపై, అలాగే ఒక కంపెనీని తగలబెడతానన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిపై చట్టం ఎందుకు చర్యలు తీసుకోలేదు?.. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు ఒక నీతి.. బాల్క సుమన్‌కు ఒక నీతా అని ప్రశ్నించారు. బాల్క సుమన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వానికి అంత కోపం ఎందుకని నిలదీశారు. ఉద్యమంలో బాల్క సుమన్‌పై 220 కేసు లు పెట్టారని, ప్రస్తుతం ఆ రికార్డ్‌ను బద్దలు కొట్టాలని ప్రభు త్వం చూస్తున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, సింగరేణి సంస్థలో జరుగుతున్న వేల కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణాలను ప్రజల దృష్టి నుంచి మళ్లించేందుకే మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను అక్రమ కేసులతో జైలులో పెట్టా రని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం చంచల్‌గూడ జైలులో ఉన్న బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డిలతో కలిసి కేటీఆర్ ములాకత్ అయ్యారు. అనంత రం జైలు బయట ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రభుత్వ అక్రమాలకు, జైలు శిక్షలకు బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదని, సింగరేణి కార్మికుల పొట్టగొడుతున్న కాంగ్రెస్ సర్కార్‌ను గల్లా పట్టి నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి జరుగుతున్న భారీ కుంభకోణాలను బీఆర్ఎస్ పార్టీ ఆధారాలతో సహా బయటపెడుతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లో 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' పేరిట జరిగిన రూ. 15,000 కోట్ల కుంభకోణాన్ని బీఆర్ఎస్ బహిర్గతం చేసిందన్నారు. అలాగే సోలార్ టెండర్లలో జరిగిన వందల కోట్ల అక్రమాలను బీఆర్ఎస్ నేత హరీష్‌రావు బయటపెట్టారని గుర్తుచేశారు. నైనీ బొగ్గు టెండర్ వ్యవహారంలో మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్య వాటాలు కుదరక, చివరకు మీడియా ప్రతినిధులను అరెస్ట్ చేసే వరకు వెళ్లారని, ఆ తర్వాత సదరు టెండర్‌ను రద్దు చేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సమావేశంలో సింగరేణి సంస్థలో జరుగుతున్న అన్యాయాలపై బాల్క సుమన్ కార్మికుల పక్షాన నిలబడి గళమెత్తారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డు ద్వారా 19 వేల వారసత్వ ఉద్యోగాలు ఇస్తే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలుగా బోర్డు మీటింగులు పెట్టకుండా వేలాది మంది కార్మిక బిడ్డలకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. పైగా గతంలో ఇచ్చిన 19 వేల ఉద్యోగాలపై విజిలెన్స్ ఎంక్వైరీ జరిపిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించి కార్మికుల్లో కలవరం రేపారని మండిపడ్డారు. కార్మికుల ఆక్రోశాన్ని చూసి చలించిపోయిన బాల్క సుమన్ మాట్లాడిన మాటలను వక్రీకరించి, సింగరేణిలో జరుగుతున్న అసలు దోపిడీని కప్పిపుచ్చడానికే ఆయనపై అక్రమంగా పీడీపీపీ యాక్ట్ కింద కేసులు పెట్టి జైలుకు పంపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల అతి ఉత్సాహాన్ని మెజిస్ట్రేట్ కోర్టు కూడా మందలించి, సదరు సెక్షన్లను తొలగించిందని గుర్తుచేశారు. సింగరేణిలో బడా బాబుల ఆధ్వర్యంలో మైనింగ్ చేయని బొగ్గును చేసినట్టుగా రికార్డులు సృష్టించి రూ. 1,600 కోట్ల మేర గోల్‌మాల్ చేశారని, 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం దీనిపై ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఈ భారీ స్కామ్‌పై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి రేపే సమగ్రమైన లేఖ రాస్తానని ఆయన ప్రకటించారు. ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎం దుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ములాకత్‌లో బాల్క సుమన్ ఎంతో ధైర్యంగా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. 'నా గురించి ఎవరూ బాధపడొద్దు, నాకు జైళ్లు, కేసులు కొత్త కాదు. ఉద్యమ కాలంలోనే నాపై 220 కేసులు పెట్టారు. మంచిర్యాల, ఆదిలాబాద్, రామగుండం ప్రాంతాల్లో సింగరేణి కార్మికులు తీవ్ర ఆక్రోశంలో ఉన్నారు. నాకంటే వారి సమస్యల మీదే దృష్టి పెట్టండి, వారి కోసం పోరా డండి' అని సుమన్ తమతో అన్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. సింగరేణిలో జరిగే అక్రమాలు, అన్యాయాలపై కార్మికుల పక్షాన నిలదీస్తూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోయేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. 'గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి.. ఆనాడు ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన 'ప్రగతి భవన్'ను బాంబులు పెట్టి పేల్చేసినా తప్పులేదు అన్నప్పుడు అప్పటి ప్రభుత్వం ఎందుకు జైల్లో పెట్టలేదు? ఆయన శిక్షార్హుడు కాదా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిం చారు. హైదరాబాద్ పాతబస్తీపై 'సర్జికల్ స్ట్రైక్' చేస్తామన్న ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఎందుకు చర్యలు లేవు?.. బాల్క సుమన్‌పై పెట్టిన సెక్షన్లు ఆయనకు వర్తించవా? అని నిలదీశారు.

# కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి: కలెక్టర్

ఆదిలాబాద్, : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' ద్వారానే పట్టణాల్లోని ప్రతీ వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరం స్విమ్మింగ్ పోటీలలో రెండవ బహుమతి పొందిన మున్సిపల్ చైర్పర్సన్ దంపతుల కుమార్తె బండారి అమిత కు కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు. వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డ్ ప్రత్యేక అధికారి నిహారిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి : మంత్రి తుమ్మల



హైదరాబాద్, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు(ఎల్‌నినో) తలెత్తే అవకాశమున్న నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి సన్నద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..సీఎం ఆదేశాల మేరకు ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, వర్షాభావాన్ని తట్టుకునే పంటలు, ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేల సారం దెబ్బతినడంతో పాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పంట వ్యర్థాల కాల్చివేతలకు సంబంధించిన శాటిలైట్ చిత్రాల విషయాన్ని ప్రస్తావిస్తూ ఇదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి శాటిలైట్ ఆధారిత నివేదికలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కోహెడలో రూ. 2,284.32 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు ఈ నెల ఆరో తేదీన సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. కోహెడ మార్కెట్ మార్కెటింగ్ రంగానికి మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సభా ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ పరిధిలోని ఖాళీ స్థలాల పరిరక్షణ కోసం నెల వ్యవధిలో ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలనీ, ఆస్తుల పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వాటిని లీజుకిచ్చి ఆదాయ వనరులు సమకూర్చుకునే అవకాశాలను పరిశీలించాలని, అది సాధ్యంకాని చోట్ల విస్తృత స్థాయిలో ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ పనితీరును కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ మరోసారి ప్రశంసించిందన్నారు. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో ఈ యాప్ అమలు దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించిందన్నారు. యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తే రాష్ట్రానికి ప్రోత్సాహకాలు కూడా అందజేస్తామని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ హామీ ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ ఎమ్‌డీ యాస్మిన్ బాషా, ఆగ్రోస్ ఎమ్‌డీ రాములు పాల్గొన్నారు.

# పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ

హైద్రాబాద్: గూగుల్ మ్యాప్స్‌లో బస్తీలు.. కాలనీలను పరిశీలిస్తాడు.. ఎంచుకున్న కాలనీని గూగుల్ స్ట్రీట్ వ్యూలో మరోసారి పరిశీలించి.. నేరుగా ఆ ప్రాంతానికి వెళ్తాడు.. అక్కడ టూలెట్ బోర్డులు సమీపంలో తాళం వేసిన ఇండ్లను ఎంచుకొని ఐదు నిమిషాల వ్యవధిలో ఇంటి తాళాలు పగలగొట్టి ఆ ఇంట్లో ఉన్న సొత్తును అపహరిస్తున్న అంతరాష్ట్ర హైటెక్ దొంగను మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరి డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిసిపి శ్రీధర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మోండా మార్కెట్ పరిధిలోని పాట్ మార్కెట్‌లో శ్రీ సాయి బులియన్ జ్యూవెల్లరీ షాప్‌లో ఉద్యోగిగా పని చేస్తున్న సందీప్ రఘునాథ్ చవాన్ ఇంట్లో మే 27న ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసి అక్కడి నుంచి పరారైయ్యాడు. వెంటనే బాధితుడు మార్కెట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హైదరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని సీసీ కెమెరాలను జల్లెడ పట్టి దొంగ ఎవరు..? అనే విషయాన్ని గుర్తించారు. ఢిల్లీకి చెందిన పాత నేరస్తుడు మనోజ్ కుమార్ సింగ్ (28 ) చోరీ కేసులలో అరితేరాడు. హైటెక్ పద్దతిలో రెక్కీ నిర్వహిస్తాడు.. గూగుల్ మ్యాప్‌లలో చిన్న చిన్నగా ఉండే రోడ్లు, అక్కడ రద్దీ లేని ప్రాంతాలను ఎంచుకుంటాడు. ఆ తరువాత స్ట్రీట్ వ్యూలో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాడు. అక్కడకు వెళ్లి టూలెట్ బోర్డులు ఎక్కడున్నాయి... తాళాలు వేసిన ఇండ్లు ఎక్కడున్నాయనే విషయాలను ఆరా తీస్తాడు. ఇలా రెక్కీ నిర్వహిస్తూ అవకాశాన్ని బట్టి తాళం వేసిన ఇంటిని ఎంచుకొని ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో ఆ ఇంటిని లూటీ చేస్తాడు.ఇలా మే 27న హైదారబాద్‌కు వచ్చి సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలను గూగుల్ మ్యాప్‌లో పరిశీలించాడు. మొదట ఎస్ఆర్‌నగర్ ప్రాంతాన్ని ఎంచుకున్న అక్కడ రోడ్లన్ని రద్దీగా ఉండడంతో తన ప్లాన్‌ను మరో ప్రాంతానికి మార్చేశాడు. ఈ క్రమంలో మోండా మార్కెట్ పోలీసు స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఓ ఇంటిని గుర్తించాడు.

# వర్షాకాలంలో అనారోగ్యం పడకుండా చర్యలు

భువనగిరి :రానున్న వర్షాకాలం దృష్ట్యా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు అనారోగ్య బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అన్నారు. యాదగిరిగుట్టలోని కొత్త గుండ్లపల్లి గ్రామంలో 8వ వార్డులో వాటర్ ఫిల్టర్ ను చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్ర మంలో భాగం గా యాదగిరిగుట్ట పట్టణంలో 1,2,3 వార్డు లలో వార్డ్ సభలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట మున్సిపల్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని దీనికి పట్టణంలోని ప్రజలు సహకరించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై రానున్న వర్షాకాల రిత్యా అనారోగ్యం పలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనేజీలు చెత్త నిలవకుండా చూడాలని చెత్త బండికి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వేయాలన్నారు.ఇతర ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ బరిగే రమ్య రామచందర్, కమిషనర్ బి శ్రీనివాస్, కౌన్సిలర్ బోడ రాధ, బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, మాలోతు హరీష్, మాధవి ప్రవీణ్, లావణ్య శ్రీధర్ గౌడ్, సత్యనారాయణ, ధనలక్ష్మి మధుకర్, మల్లేష్, శ్రీధర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు గౌలికర్ అరుణ రాజేష్, బండి జంగమ్మ, రహీమ సలాం, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు- ఎమ్మెల్యే వేముల

నకిరేకల్ : రామన్నపేట మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి వేములకొండకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సేవను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బస్సుకు పూజలు నిర్వహించి, జెండా ఊపి సేవలను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.వేములకొండ ప్రాంత ప్రజలు చాలా కాలంగా నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న నేపథ్యంలో ఈ కొత్త బస్సు సేవను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు మరియు సాధారణ ప్రయాణికులకు ఈ సేవ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంతో పాటు, విద్య, వైద్యం, ఉపాధి అవసరాల కోసం పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సులభతరం కావడానికి ఈ బస్సు సేవ దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు మరియు పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు. నూతన బస్సు సేవ ప్రారంభం పట్ల వేములకొండ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# మంత్రి కోమటిరెడ్డి సహకారంతో అభివృద్ధి



నల్లగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నల్లగొండ కార్పొరేషన్ లోని 10,11, 31, 32,,33,34,41 వ డివిజన్ లలో స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలను అందించి ఆర్థికంగా బలోపేతం చేస్తుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను మరింత అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అన్ని డివిజన్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు, అందజేయడం జరుగుతుందని తెలిపారు. నగరంలో విద్యుత్ లో వోల్టేజ్ ను త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నీటి ట్యాంకులు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. 24 గంటలు తాగునీటిని సరఫరా కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు పాలకూరి సుమలత సంతోష్ గౌడ్, పిల్లి కృష్ణంరాజు, కౌసర్, రేగట్టే అండాలు లింగస్వామి, ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ప్రదీప్ నాయక్, జానయ్య, నాయకులు దోనాల నాగార్జున రెడ్డి, నకిరేకంటి సైదులు, రాక్ హిల్స్ కాలనీ అధ్యక్షులు సోమన బోయిన నరసింహ యాదవ్ ఆబిద్ ఫకీర్ వెంకటరెడ్డి అంజయ్య సుదర్శన్ పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని వార్డు సభలు, మున్సిపల్ కౌన్సిలర్ల పర్యవేక్షణలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీ పాల్ రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డో ర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచం ద్రు నాయక్, ముఖ్య అతిథిగా హాజరై మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తోందన్నారు.రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళల ఆర్థిక సాధికారత కోసం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, గృహ అవసరాల భారాన్ని తగ్గించేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించడమే ప్రజా పాలన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అభివృద్ధి ఫలాలు ప్రతీ అర్హుడికి వరకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులు, మురుగు కాలువలు, విద్యా, వైద్య సేవల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే, నరేష్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ ఆఫీసర్,బి.వీరా సింగ్, వార్డు కౌన్సిలర్స్ మెరుగు రాము, జాటోత్ సురేష్ నాయక్, పానుగోతు రాములు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అఫ్జల్, వెంకన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి - మంత్రి సీతక్క



హైదరాబాద్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలు, పనుల పురోగతి, నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రస్తుతం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 589 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయనీ, వీటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం ద్వారా అదనంగా మరో రూ. 600 కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ఒక్క రూపాయి కూడా వెనక్కి వెళ్లకుండా అన్ని నిధులను సద్వినియోగం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. రైతులకు ఉపయోగపడే పొలం బాటల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ రవాణా సౌకర్యాలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం అవుతుందని, రైతులకు అదనపు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన 8000 మహిళా గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణ పనుల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలనీ, నిర్ణీత గడువులోపు కనీసం 50 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాల పనులను కూడా వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను వినియోగించాలని సూచించారు. జులై 1 నుంచి వీబీజీ రాంజీ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో జూన్ చివరి వరకు ఉపాధి హామీ నిధులను పూర్తిస్థాయిలో వ్యయం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్లోపు పనులు పూర్తిచేయాలి - మంత్రి పొంగులేటి



హైద్రాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలో 13 ఆధునిక సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం వేగంగా జరుగుతున్నది. గచ్చిబౌలి తాలింలో నిర్మాణంలో ఉన్న తొలి కార్యాలయాన్ని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వానికి భారం లేకుండా ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. నిర్మాణంతో పాటు ఐదేళ్ల నిర్వహణను కాంట్రాక్టర్ సంస్థలే చూసుకుంటాయి. 45 వేల చదరపు అడుగులుగా ప్రతిపాదించిన కార్యాలయాన్ని 75 వేల చదరపు అడుగులకు విస్తరించారు. విశాల హాళ్లు, ఆధునిక సౌకర్యా లతో వృద్ధులు, మహిళలు, పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి.డిసెంబర్లోపు పనులు పూర్తిచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. ప్రాజెక్టు వ్యయం రూ. 30 కోట్లు దాటుతుందని తెలిపారు. 100% వరకు భూముల ధరలు పెంపు రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలు 50 నుంచి 100 శాతం వరకు పెంచామన్నారు దీంతో ప్రభుత్వానికి రూ. 1,400 కోట్ల ఆదాయం సమకూరుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఖాజాగూడ ప్రాంతాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ శివార్లలో భూముల విలువ గణనీయంగా పెరగనుందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం భూముల విలువ మాత్రమే పెంచామని, రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచడం లేదు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచితే భవిష్యత్తులో మళ్లీ భూసేకరణ చేయాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వ ఖజా నాపై భారం పడుతుందని మంత్రి వివరించా రు. గచ్చిబౌలి తామ్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అంతకు ముందు సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువ ఎకరాకు కనీస ధర రూ. 2.75 లక్షలుగా నిర్ణయించామని, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో రూ. 5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ. 10 లక్ష, ఓఆర్ఆర్ పరిధిలో రూ. 15 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. సవరించిన భూములు విలువల్లో వ్యత్యాసాలు ఉంటే సమీక్షిస్తామని మంత్రి వెల్లడించారు. సవరించిన భూముల విలువలు, సందేహాలు, ఫిర్యా దుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 180059947 88, వాట్సాప్ 8247619983 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ఆలోచన లేదురిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. గత బీఆ ర్ఎస్ ప్రభుత్వం 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది. ఒక్క శాతం పెంచినా రూ.వేల కోట్ల భారం ప్రజలపై పడుతుందనే ఆలోచన తో నిర్ణయం తీసుకున్నామన్నారు. వాస్తవానికి దగ్గరగా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను సవరించామన్నారు. అక్రమాలకు తావు ఇవ్వకూడదన్న ఆలోచనతో సబ్ రిజిస్ట్రార్ల అధికారాలను కుదించామని చెప్పారు.త్వర లో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయన్నారు. ప్రజలకు వేగవంతంగా, పారదర్శక సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామన్నా రు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏసీబీ కేసులకు సంబంధించిన ఫైళ్లను తొక్కిపెట్టారని మంత్రి ఆరోపించారు. కానీ, కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన మొదటి 3 నెలల్లోనే 3,500 పెం డింగ్ ఫైళ్లను క్లియర్ చేసిందని వెల్లడించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్‌లో సంస్కరణలు ప్రజలకు పారదర్శకమైన, అవినీతిరహిత సేవలు అందించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసు కొచ్చామని, స్లాట్ బుకింగ్ విధానం ద్వారా సమయాన్ని ఆదా చేయడమే కాకుండా అత్యాధునిక సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, 13 క్లస్టర్లుగా విభజించి ప్రభుత్వంపై ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణ బాధ్యతలను కూడా ఆ సంస్థలకే అప్పగించాం.మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాల ను ఏర్పాటుచేస్తున్నా మన్నారు. ఒకటి, రెండు రోజుల్లో కోహెడలో కూడా ఇంటిగ్రేటెడ్ భవానానికి శంకుస్థాపన చేస్తామన్నారు. రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామన్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే అవకాశం నాకు దక్కిందని, ఇది చాలా తృప్తినిచ్చిందని పేర్కొన్నారు. నేను ఏ తప్పు చేయలేదు, చేయనుతాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని. దేవుడి దయతో ఇంతవరకు వచ్చాను. నాకు ఏ శాఖ ఇచ్చినా మనస్ఫూర్తిగా పని చేస్తానన్నాని మంత్రి పొంగులేటి అన్నారు. తాను ఏ తప్పు చేయలేదని, తప్పు చేసే వ్యక్తిని కానన్నారు. ఏ ఫైల్‌పై గుడ్డిగా సంతకం పెట్టలేదని, చట్ట ప్రకారం పని చేస్తున్నానని వివరించారు. రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై, ఏసీబీ ట్రాప్ అయిన వారిపై గత ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాను రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 3,500 ఫైళ్లను క్లియర్ చేశానని చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తనపై ప్రేమ ఎక్కువని, అందుకే అప్పుడప్పుడు హగ్గింగ్ చేస్తుంటారని మంత్రి పొంగులేటి సెటైర్ వేశారు. ఫ్యూచర్ సిటీ రద్దు సాధ్యం కాదు అధికారం లోకి రాగానే ఫ్యూచర్ సిటీ'ని రద్దు చేస్తామంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలకు లోబడి పనిచేస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫ్యూచర్ సిటీ రద్దు వంటి వ్యాఖ్యలు చేయ డం సహజమేనని, ఒకవేళ ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తే.. అక్కడ భూములు కొనుగోలు చేసిన వారికి తిరిగి డబ్బులు చెల్లించాల్సి ఉం టుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని మంత్రి హితవు పలికారు. ఫ్యూచర్ సిటీ రద్దు చేయడం సాధ్యమయ్యే పని కాదన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

సూర్యాపేట, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై, ఉందని లైన్స్ క్లబ్ జోనల్ అధికారి పోలవరపు సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని ఐఓసీ బంకులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి ,పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వాడడం, ప్లాస్టిక్ వస్తువులు నిషేధం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోరారు. విధిగా మొక్కలు నాటి ,పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో తుంగతుర్తి లైన్స్ క్లబ్ అధ్యక్షులు తల్లాడ కేదారి, సెక్రటరీ గుండ గాని రాము ,కోశాధికారి ఓరుగంటి శ్రీనివాస్, కోఆర్డినేటర్లు ఓరుగంటి సుభాష్, ఎనగందుల గిరి, ఎనగందుల శ్రీనివాస్, డాక్టర్ చారి, డాక్టర్ పప్పుల వెంకన్న, గుడిపూడి లక్ష్మణరావు, ఎనగందుల సంజీవ, గుండ గాని రాము ,కోశాధికారి ఓరుగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280